క్లుప్తంగా

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీలో గల రామతీర్థాల రహదారిలో ఉన్న వివాదాస్పద స్థలాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ స్థలాన్ని తొలిత ఎమ్మెల్యే ఈశ్వరరావు పరిశీలన చేశారు. చెరువు గట్టును ఎవరు తొలగించారో పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టాలని వీఆర్వో అప్పలనాయుడుకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి చదును చేసి వ్యక్తులను పిలిపించారు. కొండములగాం గ్రామానికి చెందిన రెడ్డి అప్పమ్మ పేరున 30 సెంట్ల ప్రభుత్వ పట్టా మంజూరు చేసినట్లు రికార్డుల్లో ఉంది. చెరువు సర్వే నంబర్, ఈ పట్టా సర్వే నంబర్లో వ్యత్యాసం ఉంది. పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులున్నారు. ఈ పరిశీలనలో రెవెన్యూ అధికారులు లుకలాపు అప్పలనాయుడు, దేవమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, సర్వేయర్ మధు తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సన్యాసిరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసిరావు అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నియంత్రణ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాలల్లో ర్యాగింగ్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. నియంత్రణకు కమిటీలు వేయాలని, ఈ కమిటీలో అధ్యాపకులు, విద్యార్థులు సభ్యులుగా ఉండాలన్నారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కుంటే విద్యార్థులు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. క్రిమినల్ కేసులకంటే ర్యాగింగ్ కేసులు ప్రమాదకరమన్నారు. హెరాయిన్, కొకైన్, గంజాయి వంటివి కనిపిస్తే మేనేజ్‌మెంట్ దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లాలి, మేనేజ్‌మెంట్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు, డ్రగ్ కంట్రోల్ సహాయ సంచాలకులు చందనరావు, బాలల క్షణ అధికారి కె.వి.రమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.అఖిల, అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినీష పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండంలోని మురపాక గ్రామ పంచాయతీలో మంచినీటి పైపునీటి లైన్లను లీకై నీరు వృథా అవుతుంది. రోడ్లుపై నీరు నిలచిపోవడంతో ఈ సమస్యను సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. దీనిపై సర్పంచ్ చొరవ తీసుకుని మూడు రోజులపాటు పైపులైన్లను సరిచేసి గ్రామస్తులకు తాగునీటి కొరత తీర్చారు.

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన



పైడిభీమవరంలో అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

రణస్థలం: మీ ఇంటి కరెంట్ బిల్లు వెయ్యి రూపాయలు దాటితే ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో భాగంగా సబ్సిడీ ద్వారా అందించే సోలార్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు చాలా తగ్గుతుందని పైడిభీమవరం ఏఈ శ్రీనివాస సాహు చెప్పారు. మండలంలోని పైడిభీమవరంలో పీఎం సూర్య ఘర్ యోజనపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఒక కిలో వాట్ సోలార్ యూనిట్ విలువ లక్ష రూపాయలని, అందులో రూ.30 వేలను ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. రెండు కిలో వాట్ సోలార్ యూనిట్ విలువ రూ.2 లక్షలు ఉంటే రూ.60 వేల ప్రభుత్వ రాయితీ ఉంటుందని, మూడు కిలో వాట్లకు రూ.78 వేలు రాయితీ ఉంటుందన్నారు. ఫిక్సింగ్ చార్జీలు అదనంగా పడతాయన్నారు.

కవితా సంకల్పం ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ చైతన్యకిరణాలు, బాల కథా నిలయం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు రచించిన 'వందనం వందనం జాతీయ జెండా రూపొందించిన పింగళి వెంకయ్యకు వందనం' అనే కవిత సంకల్పాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద జరిగిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

● ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి



పోలీసులు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్ అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీసులు శుక్రవారం ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల నుంచి అదనపు ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీసులు ప్రజలతో కలిసి పని చేయాల్సి ఉంటుందన్నారు. ఒత్తిడికి దూరంగా, ఉత్సాహంగా పని చేయాలంటే మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండాలన్నారు. ఆరోగ్య పరీక్షలు కనీసం మూడు నెలలకు ఒకసారి చేయించుకోవాలని సూచించారు. నిరంతరం శారీర దారుఢ్యం కోసం శారీరిక శ్రమ అవసరమన్నారు.

\- ఎచ్చెర్ల క్యాంపస్

● నల్ జల్ మిత్రపై శిక్షణ



రణస్థలం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నల్ జల్ మిత్ర ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ఎన్నో ఇళ్లకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విభాగంలో ప్రస్తుత ప్రభుత్వం మహిళలను భాగస్వామ్యం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల రామారావు, బవిరి రమణ, ఉప్పాడ అప్పన్న, పిల్ల తాత, ఏపీఎం ఎం.వి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

\- రణస్థలం

● మహాలింగార్చన



అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చన చేపట్టారు. అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ చేసిన అర్చనాభిషేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

\-అరసవల్లి

● మాస శివరాత్రి పూజలు



శ్రీకాకుళం గుడివీధిలోని బలరామ ప్రతిష్ఠ దేవాలయంగా ప్రసిద్ధి పొందిన ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. రకరకాల పువ్వులు, బిల్వ పత్రాలతో స్వామివారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

\-శ్రీకాకుళం కల్చరల్

సమరయోధులు భావితరాలకు ఆదర్శం

- జిల్లాకే తలమానికం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



భారీ జెండాతో విద్యార్థులు



పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని గాంధీ మందిరంలో వెంకయ్య విగ్రహానికి కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు శుక్రవారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గాంధీ మందిరం, స్వాతంత్ర్యసమరయోధుల స్మృతివనంలో అడుగు పెట్టగానే మనసు భావోద్వేగానికి గురవుతోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గాంధీ మందిరం, ఇంతమంది సమరయోధులు విగ్రహాలు, జాతీయ జెండా ఏర్పాటు ఒకే చోట ఉండడంతో ఈ ప్రదేశం ఓ చారిత్రాత్మక ఘట్టాన్ని రూపుదిద్దుకుంటుంది అన్నారు. ప్రతి ఒక్కరి మదిలో శాశ్వతంగా నిలిచిపోయేలా గాంధీ మందిరం, సమరయోధుల స్మృతి వనం నిర్మాణాన్ని అభినందించారు. సమరయోధుల ఆశయాలను, దేశభక్తిని భావితరాలకు తెలియజేయడంలో గాంధీ మందిర కమిటీ సభ్యులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. జాతీయ జెండా రూపశిల్పి వెంకయ్య జయంతి కార్యక్రమంలో, ర్యాలీలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే తరాలవారికి ఇది ఒక స్ఫూర్తి అన్నారు. విద్యార్థులు, ప్రజలు స్మృతివనాన్ని సందర్శించి త్యాగధనుల స్ఫూర్తిని అందిపుచ్చుకునేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహణకు సహకరిస్తామన్నారు. దేశానికి రెండు కళ్లుగా నిలుస్తున్న సైనికుడు, రైతుల ప్రతిరూపంతో కూడిన అరుదైన విగ్రహాన్ని తనవంతుగా స్ఫూర్తివనంలో ప్రతిష్ఠిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. జిల్లా నుంచి త్రివిధ దళాల్లో దేశరక్షణ కోసం ఉండడం చాలా గర్వపడాల్సిన విషయం అన్నారు. ముందుగా గాంధీ మందిరం బృందంతో పాటు ఇండియన్ ఆర్మీ కాలింగ్ ప్రతినిధి బృందం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియం నుంచి శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం సమరయోధుల స్మృతి వనం వరకు జాతీయ పతాకాన్ని భుజాలపై మోసుకొని తీసుకువెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో మువ్వెన్నెల పతాకం మెరిసి మురిసిపోయింది. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ చల్ల ఓబులేసు, కమిటీ నిర్వాహకులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, సురంగి మోహనరావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, బాడాన దేవభూషణరావు, నూక సన్యాసిరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన మురళీధర్, మహిబుల్లాఖాన్, సక్క శంకరరావు, ఎం.వి.ఎస్.భట్లు, పందిరి అప్పారావు, గుత్తు చిన్నారావు, గుత్తు రవి, శాస్త్రి, నిక్కు అప్పన్న, పైడి హరనాథ్‌రావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, సీఐ ఉమామహేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణ రావు, భోగేల ఉమామహేశ్వరరావు, టిక్కం రాంగోపాల్, టీడీపీ నాయకులు రెడ్డి గిరిజా శంకర్, రౌతు సంతోష్, నవీన్, బుజ్జి పాల్గొన్నారు.

తల్లిపాలలో పోషకాలు మెండు



శ్రీకాకుళం అర్బన్: తల్లిపాల ఆవశ్యకతను గూర్చి వివరిస్తున్న సీడీపీవో శోభారాణి



శ్రీకాకుళం అర్బన్: గూనపాలెంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. నగరంలోని 33వ డివిజన్ గూనపాలెంలోని అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. స్థానిక వార్డు ఇన్‌చార్జి కొర్ను నాగార్జున ప్రతాప్, పి.రాజు, దీర్ఘాసి హరి పాల్గొన్నారు. బాలింతలు, గర్భిణులతో బిడ్డకు తల్లి పాలు ఇస్తామని ప్రతిజ్ఞ చేయించి వారికి పౌష్టికాహారాన్ని అందజేశారు. స్థానిక ప్రతినిధులు నడగాన విజయ, యజ్జల బాలామణి, కె.రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రాజేశ్వరి, ఆదిలక్ష్మి, హైమరత్నం, హెల్పర్‌లు మణి, పాప, ఆశావర్కర్ అమ్మాజీ పాల్గొన్నారు.

కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలోని మెహర్‌వీధి, దూదివారిసందు, కుమ్మరవీధి, రైతుబజారు, గారవీధి, కత్తెరవీధి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తల్లిపాల ప్రాధాన్యతను ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో శోభారాణి వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కృష్ణా పార్క్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి ఇప్పిలి తిరుమలరావు, నూకరాజు, ఎం.ఎస్.కె.మనీషా, హిమబిందు, సుజాత, సూర్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్య, విజయ, అరుణ, ఇందిర, నీలవేణి, సంధ్యారాణి ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సెక్టార్‌లోని కంపోస్టు కాలనీ, ఎన్‌హెచ్‌బీ కాలనీ అంగన్‌వాడీ మెర్జింగ్ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ సీడీపీఓ శోభారాణి పాల్గొని తల్లిపాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు తెలియజేశారు. అంతకుముందు అవగాహన ర్యాలీని చేపట్టారు. సెక్టార్ సూపర్‌వైజర్ కల్యాణి, మూడో డివిజన్ ఇన్‌చార్జి అంబటి లక్ష్మీరాజ్యం, 30వ డివిజన్ ఇన్‌చార్జి పి.సాగర్, సాయి, పద్మ, కళావతి, సంతోష్, శేఖర్, చిన్న, 30, 35వ డివిజన్ ఎంఎస్‌కేఎస్‌లు, ఏఎన్ఎం, ఆశా, అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పొన్నాడలో..

ఎచ్చెర్ల క్యాంపస్: తల్లిపాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కూన అరుణ కుమారి అన్నారు. పొన్నాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తక్షణమే తల్లిపాలు ఇవ్వటం ప్రారంభించాలన్నారు. బిడ్డ ఆరోగ్యం, రోగనిరోధక సామర్థ్యం మెరుగుపడతాయన్నారు. పీహెచ్‌సీ ఈఓ జగన్నాథరావు, ఏఎన్ఎం సుధ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సెక్టార్‌లో లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందజేస్తున్న శోభారాణి

మహిళలకు మల్టీ స్కిల్ ట్రైనింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: అన్ని రంగాల్లోనూ మహిళలను భాగస్వామ్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇప్పిస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నల్ జల్ మిత్ర ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు మహిళా సంఘ సభ్యులను గుర్తించి వారికి మల్టీ స్కిల్ ట్రైనింగ్‌లో భాగంగా ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్, తాపీపని, పంప్ ఆపరేటర్ వంటి పనులపై 60 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీరు తమ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి పనులకు టెక్నికల్ సపోర్టు ఇవ్వనున్నామన్నారు. ఈ విధంగా మహిళలకు గ్రామాల్లోనే పని దొరకడంతోపాటు స్వయంగా సొంత ఇంటిలోని ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్, తాపీ పని వంటి పనులు చేసుకోవచ్చునన్నారు. కుటమి నాయకులు, ఏపీఎం ఎం.వి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస గురుకు పాఠశాల సమీపంలోని నారాయణపురం కుడి కాలువపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. రెండు పక్కల రక్షణ గోడ, వంతెన శ్లాబ్‌ను బాగుచేస్తున్నారు. దుప్పలవలస గురుకులం, పక్కన ఉన్న అర్బన్ కాలనీ ప్రజలకు ఇదే రాకపోకలకు ప్రధాన ఆధారం. మరోపక్క వంతెనకు కింద నుంచి పిల్లర్లు సపోర్టుగా ఇస్తున్నారు. శాశ్వత వంతెన నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

02 ఈటీఎల్ 23: మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కరుణశ్రీ సాహితీ సభ రేపు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ కవి, తిరుమల తిరుపతి దేవస్థానం వారి పోతన భాగవతం ప్రాజెక్టు పూర్వ ప్రధాన సంపాదకులు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి ఉత్సవ సభను ఈనెల నాలుగో తేదీన నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నెలవారీ 95వ సాహితీ వేదికలో భాగంగా శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఉపన్యాసకర్తగా జంధ్యాల శరత్‌బాబు వ్యవహరిస్తారని, సభ్యుల స్వీయ రచనల పఠనం ఉంటుందన్నారు. సాహిత్యాభిమానులంతా హాజరు కావాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఎచ్చెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లావేరు ఎంఈఓ ఈశ్వరరావు అన్నారు. లావేరు మండల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. లావేరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈ నెల నాలుగో తేదీన పట్టణంలోని ఓ హోటల్ నిర్వహించనున్నట్టు క్లబ్ సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ శుక్రవారం తెలిపారు.

ఈ కార్యక్రమానికి క్లబ్ డిస్ట్రిక్ట్ 316ఏ గవర్నర్ ప్రొఫెసర్ ఎస్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న 12 లయన్స్ క్లబ్ సభ్యులందరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా సుమారు ఐదువేల మొక్కలను పలు కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ దత్తత తీసుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో నాటనున్నట్టు పేర్కొన్నారు.

కుర్చీల వితరణ

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు మురపాక వెంకటరమణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఎం.ప్రసాదరావు బ్రదర్స్ మూడు కుర్చీలను శుక్రవారం అందించారు. లావేరు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసురావు స్కూల్‌ను దత్తత తీసుకున్నారు. పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. హెచ్ఎం పి.వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం పంచాయతీ అఖింఖాన్‌పేట గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.56.80 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పథకానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రతీ గ్రామానికి తాగునీరు అందిస్తామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని వేంచేసిన ఉమాజఠలేశ్వరస్వామిని ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా పండ్లతో శుక్రవారం అలంకరించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. టెక్కలి అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ అంశాన్ని గతంలో సాధ్యం కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు మతోన్మాద బీజేపీ కక్షపూరితంగా వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ అగ్ర నాయకుడు అమిత్‌షా కాళ్ల దగ్గర దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా మాదిగ దండోరా నాయకుడు మందకృష్ణ మాదిగ వ్యవహరించారని ఆరోపించారు. తక్షణమే ఇటువంటి నిర్ణయాలను వెనక్కితీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు చల్లా రామారావు, వై.గోపి, కె.కామేశ్వరరావు, ధర్మారావు, శ్రీను, లింగరాజు, బి.నారాయణరావు, శ్రీనివాస్, ఆట్ల రాహుల్, అరవింద్, నవీన్, నాయుడు, కూరాకుల యాదవ్, బాబురావు, తరుణ్, తిలక్, వీరాస్వామి, రాజారావు కోరారు.

సమాచార చట్టం యూత్ అధ్యక్షుడిగా నందుపిల్లి



నందుపిల్లి బాలాజీ

వజ్రపుకొత్తూరు: సమాచా రం హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమి టీ, ప్రజా రక్షణ భేరి శ్రీకాకుళం జిల్లా యూత్ అధ్యక్షునిగా దేవునల్తాడకు చెందిన నందుపిల్లి బాలరాజు శుక్రవారం ఎన్నికైయ్యారు. ఇప్పటి వరకు వజ్రపుకొత్తూరు మండలంలో ఆ కమిటీ అధ్యక్షునిగా పనిచేస్తూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తిస్తూ సంస్థ చైర్మన్ కంచర్ల సురేష్ జిల్లా కమిటీ యూత్ అధ్యక్షునిగా బాలరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భగవద్గీత పుస్తకాలు వితరణ

సోంపేట: భగవద్గీత పఠనం మానవాళికి మార్గదర్శి అని మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి అన్నారు. బేసి రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని జీడిపుట్టుగ ప్రాథమిక పా ఠశాలలో జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు శుక్రవా రం వితరణ చేశారు. విద్యార్థి దశ నుంచే భగవద్గీత పఠనం అలవాటుగా చేసుకోవాలని సూ చించారు. ఉపాధ్యాయుడు సంతోష్ ఉన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ పుష్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. కొళిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్పత్రితో పాటు గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలని, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆస్పత్రిలోనే ప్రసవాలు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం అవసరమైన నిధులు వెచ్చించాలని అన్నారు. సమావేశంలో వైద్యాధికారులు వై.కల్యాణి, రేవతి భేరి, సర్పంచ్ సంతోష్ మండలా, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, బొబ్బిలి దేవరాజు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు



మాట్లాడుతున్న మురళీమోహన్‌రావు

కవిటి: విద్యార్థులు, రైతులు పెట్టుకున్న అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావులేకుండా సత్వర చర్యలు తీసుకునేలా వీఆర్వోలు వ్యవహరించాలని తహసీల్దార్ బి.మురళీమోహనరావు అన్నారు. ఇటీవల విధుల్లో చేరిన తర్వాత తొలిసారిగా వీర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అంశాల పురోగతి ఎలా ఉందో సిబ్బందితో చర్చించారు. గతంలో వ్యవస్థాగతంగా ఉన్న లోపాల్ని సరిదిద్దుకుంటూ మనమంతా సమష్టిగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీ తదితర అంశాలపై ఆరా తీశారు. డీటీ పి.రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి ఉన్నారు.